# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతి సహా వివిధ అంశాలపై ఈరోజు సమీక్ష నిర్వహించారు.

- సూపర్ ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని భద్ర పరుచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

- రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహితంగా మార్చేందుకు వినూత్న విధానాలతో ముందుకు వెళుతున్నామని మంత్రి పి. నారాయణ తెలిపారు.

- భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని రేపు రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, సచివాలయం, హైకోర్టు ప్రాంగణాల్లో జాతీయ పతాక ఆవిష్కరణ జరగనుంది.

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతి సహా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి.. లోటు వర్షపాతం, భూగర్భ జలాలు, తాగు నీటి సరఫరా, నిర్వహణా ప్రణాళిక, జలధార - జలహారతి కార్యక్రమాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో 89.9 శాతం మేర సివిల్ పనులు నిన్నటికి పూర్తయ్యాయని, ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి అవుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రోడ్లు లాంటి మౌలిక వసతుల పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే.. ప్రాజెక్టు సమీపంలోని గండి పోచమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ.. స్థానికుల మనోభావాలను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

=======================

సూపర్ ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని భద్ర పరుచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. వచ్చిన నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, ఆపై మిగిలిన నీటిని ఆరు మడులకు ఉపయోగించుకోవాలని సూచించారు. జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం వివరాలను మంత్రి వెల్లడిస్తూ.. పోలవరం ప్రాజెక్టు మొత్తం పనులలో 77 శాతం పూర్తయ్యాయన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

=======================

భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపు ఉదయం 7 గంటల 45 నిమిషాలకు రాష్ట్ర శాసన సభ కౌన్సిల్ ప్రాంగణంలో శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఉదయం 8 గంటలకు రాష్ట్ర శాసన సభ భవనం ముందు జరిగే వేడుకల్లో శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. సచివాలయం మొదటి భవనం వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, నేలపాడులోని హైకోర్టు వద్ద ఉదయం 10 గంటలకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు.

=======================

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జగన్నాయకులపాలెం నుంచి ద్రాక్షారామం వరకు ఈరోజు జరిగిన తిరంగా ర్యాలీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. అమలాపురం పట్టణంలో జరిగిన తిరంగా ర్యాలీలో కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా పాల్గొన్నారు.

విరామం

=======================

ఆంధ్రప్రదేశ్‌ను డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా మార్చేందుకు వినూత్న విధానాలతో ముందుకు వెళుతున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. రాజమహేంద్రవరం పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్ మీనా లతో కలిసి మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కోసం 107 ప్లాంట్లను మంజూరు చేశామని, సెప్టెంబర్ నెలాఖరుకు అన్ని ప్లాంట్లను అందుబాటులోకి తీసుకువస్తామని తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

అలాగే చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్న మంత్రి నారాయణ.. కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురంలో ఆరు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు.

=======================

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న శిక్షణా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి సూచించారు. దేశ నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు MY Bharat పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివిధ కార్యక్రమాలు, అనుభవాత్మక కార్యకలాపాల్లో పాల్గొనడం వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడుతుందన్నారు. యువత తమ ప్రతిభ, ఆలోచనలు, సృజనాత్మకతను సమాజ అభివృద్ధికి వినియోగిస్తూ.. 'వికసిత్ భారత్–2047' లక్ష్య సాధనలో క్రియాశీల భాగస్వాములు కావాలని ఆమె ఆకాంక్షించారు.

=======================

విజయనగరం జిల్లాలో వెదురు సాగును పెద్ద ఎత్తున విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి వెల్లడించారు. అమరావతి నుంచి ముఖ్యమంత్రి కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ పాల్గొని, జాతీయ వెదురు మిషన్ అమలు దిశగా జిల్లాలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలను, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. వెదురు సాగుకు అనుకూలమైన భూముల గుర్తింపు, రైతులను ప్రోత్సహించే విధానాలపై చర్చించారు. వెదురు సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా ఆర్థిక ప్రయోజనాలు చేకూరడంతో పాటు, స్థానికంగా కుటీర పరిశ్రమలకు ముడిసరుకు లభ్యత పెరుగుతుందని అధికారులు తెలిపారు.

=======================

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈరోజు గుంటూరులో మోండిగేటు మురుగుకాలువ వ్యవస్థ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుంటూరులో దశాబ్దాలుగా ఉన్న డ్రైనేజి సమస్యకు ఈ పనుల ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. నగరం నుండి బయటికి వెళ్లే ప్రధాన డ్రైన్లలో ఒకటైన మోండిగేటు సామర్ధ్యాన్ని 30 వేల లీటర్ల నుండి 50 వేల లీటర్లకు పెంచుతామని తెలియజేశారు.

=======================
=======================